క్లుప్తంగా

తూర్పుతాళ్లు పీహెచ్‌సీ తనిఖీ

నరసాపురం రూరల్: ఆసుపత్రుల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గర్భస్థ, శిశు మరణాలు లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జి.గీతాబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని తూర్పుతాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు సమ్మెలో ఉన్న దృష్ట్యా ఇన్‌చార్జి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఓపీ, డెలివరీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాన్పులు, ఇతర అత్యవసర కేసుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన వారిని పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఆమె వెంట పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్, సీహెచ్‌వో శ్రీనివాసరావు, హెచ్‌వీ నాగమణి తదితరులు ఉన్నారు.

కనకదుర్గమ్మకు వెండి పాదం సమర్పణ

యలమంచిలి: అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ వారికి గ్రామానికి చెందిన కడకట్ల చిన్న ఆంజనేయులు రూ. 90 వేలు విలువైన వెండి పాదాన్ని శుక్రవారం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి వెండి పాదానికి దాత ఆంజనేయులు కుమారుడు లీలా మోహన్, పద్మశ్రీ దంపతులతో ఆలయ అర్చకులు ఆగమ ప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా విఘ్నేశ్వర పూజ, వస్త్ర పూజ చేయించారు. అనంతరం అమ్మవారి పాదానికి వెండి పాదం తొడిగారు. ముందుగా దాత ఇంటి నుంచి ఆలయం వరకు సాంప్రదాయబద్ధంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబారీపై రాములోరి ఊరేగింపు

యలమంచిలి: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో కనకదుర్గమ్మ వారి విగ్రహాలతో ఏర్పాటు చేయడంతో పాటు రామాలయాల వద్ద కూడా కోలాట భజనలు చేస్తారు. ఈ విధంగా మేడపాడులో రామాలయాల వద్ద గత తొమ్మిది రోజులుగా కోలాట భజన చేశారు. దసరా సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక మంచినీటి చెరువుగట్టున శమీ పూజా శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అనాదిగా వస్తున్న సంప్రదాయంలో భాగంగా శుక్రజువారం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి చిత్రపటాన్ని పూజా మందిరంలో ఉంచి, ఆ మందిరాన్ని ఏనుగు అంబారీపై పెట్టి ట్రాక్టర్ మీద గ్రామంలో ఊరేగించారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి వాకర్స్ క్లబ్ సహాయం

పాలకొల్లు సెంట్రల్: చదువుకోవాలనే తపన ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు వాకర్స్ క్లబ్ ఎప్పుడూ అండగా ఉంటుందని క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు అన్నారు. గురువారం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థి కడియాల నాగమల్లేశ్వరరావుకు రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సుధాకరరావు మాట్లాడుతూ పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన విద్యార్థి నాగమల్లేశ్వరరావు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి మృతి చెందిన బాధలోనూ నీట్‌లో విజయం సాధించి విజయనగరం మహారాజా వైద్య కళాశాలలో మెడిసిన్ సీటు సాధించాడు. విద్యకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వడంతో వాకర్స్ క్లబ్ ద్వారా సహాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, ధనాని శ్రీరామమూర్తి, జవ్వాజి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కైలాసరథం బహూకరణ

యలమంచిలి: గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీనివాస్ (వైజాగ్ బుజ్జి) దసరా సందర్భంగా గురువారం రూ.8. 50 లక్షలు విలువైన కైలాసరథాన్ని బహూకరించారు. గ్రామానికి సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఏటిగట్టు దిగువున గోదావరి ఒడ్డున కైలాసవనం (శ్మశానవాటిక) ఉంది. వరదల సమయంలో వరద నీటిలో మృతదేహాలను కైలాసవనానికి తీసుకెళ్లడం కష్టమవుతుంది. అంతే కాకుండా అంత దూరం మృతదేహాన్ని మోసుకువెళ్లడానికి కూడా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుజ్జి స్పందించి కైలాసరథం కొనుగోలు చేసి ఇవ్వడంపై గ్రామస్తులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా మండలంలో ఏ గ్రామానికి వారికి కావాలన్నా ఈ వాహనాన్ని వినియోగించుకోవచ్చని బుజ్జి తెలిపారు.

కర్ణభక్త సేవా సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: పట్టణ కర్ణభక్త సేవా సంగం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు సంఘ గౌరవ అధ్యక్షుడు శాగా రాంబాబు తెలిపారు. గురువారం విజయదశమి రోజున నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. రాంబాబు మాట్లాడుతూ నూతన అధ్యక్షుడిగా కుడకా సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా శిద్దాని మల్లేశ్వరరావు, కార్యదర్శులుగా తిప్పా శివశంకరం, శాగా జ్యోతి స్వరూప్, కోశాధికారి అందే కోటయ్యతో సహా మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశామని వివరించారు. వీరి పదవీకాలం మూడు సంవత్సరాలు కొనసాగుతుందని తెలిపారు.

పెనుగొండ-సిద్ధాంతం రహదారి అధ్వానం

పెనుగొండ: పెనుగొండ-సిద్ధాంతం రహదారి గోతులమయంగా మారి పూర్తిగా అధ్వానంగా ఉంది. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పెనుగొండ సిద్ధాంతం రహదారిని ఏడేళ్ల క్రితం విస్తరించారు. గ్రామాల మధ్యలో సీసీ రహదారులు నిర్మించారు. అయితే, గ్రామ శివారునుంచి ప్రారంభమయ్యే బీటీ రహదారి ప్రతి ఏటా వర్షాలకు గోతులమయంగా మారుతూ ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. భారీగా పడుతున్న గోతులతో వాహనదారులు వర్షం కురిసినపుడు చెరువుల్లా మారే రహదారుల్లో గోతులను అంచనా వేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా మల్లప్పదిబ్బ, వడలి, రామన్నపాలెం, సిద్ధాంతం, సిద్ధాంతం లింక్ రోడ్డు మలుపు, జాతీయ రహదారి మలుపులో భారీ గోతులు పడడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గోతులు పూడ్చినా నాణ్యతా లోపంతో తిరిగి గోతులు పడ్డాయి. దొంగరావిపాలెం టోకు మార్కెట్ వద్ద ఇదే పరిస్థితి ఉంటే హుటాహుటిన సీసీ రోడ్డుకు


వడలి వద్ద గోతులమయంగా మారిన రహదారి

నిధులు మంజూరు చేయడంతో గత ఏడాది క్రితం రహదారి నిర్మాణం పూర్తి కావడంతో మార్కెట్ వద్ద వ్యాపారులకు ఇబ్బందులు తప్పాయి.

గోతులతో అవస్థలు

ముఖ్యంగా జాతీయ రహదారి మలుపు వద్ద, లింక్ రోడ్డు మలుపు వద్ద, సిమెంట్ రోడ్డు అప్రోచ్‌ల వద్ద గోతులుమాత్రం అలాగే ఉండిపోయాయి. ముఖ్యంగా రామన్నపాలెం వద్ద పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలం చెరువుల్లా, ఎండాకాలం దుమ్ము తెరలు లేస్తూ వాహనదారులకు అష్టకష్టాలు కలిగిస్తున్నాయి. కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలకు ఇటు పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాల నుంచి వెళ్లేవారు ఇదే రహదారిని వినియోగిస్తుంటారు. అదేవిధంగా పెనుగొండ కళాశాలలకు వచ్చే విద్యార్థులు బస్సులపై ఇదే రహదారిలో వస్తుంటారు. దీంతో నిత్యం వందలాది వాహనాలపై వేలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. సుమారు 9 కిలోమీటర్లు దూరం ఉండే ఈ రహదారిలో ప్రయాణం కనీసం 40 నిముషాలకు పైగా పడుతుండడంతో ఇటు విద్యార్థులు, అటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా గోతులపూడికలో నాణ్యత పాటించడం లేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతతో మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రామన్నపాలెం వద్ద రహదారి దుస్థితి


సిద్ధాంతం లింక్ రోడ్డు మలుపులో ఇలా

ముగిసిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

నరసాపురం: విజయదశమి పర్వదినం పూజలు పట్టణంలోని అన్ని అమ్మవార్ల ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. గడ్డిబజార్‌లోని ప్రసిద్ధ కనకదుర్గ ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. పాతబజార్ వలవలవారివీధిలో భద్రాద్రి రామసాయి మందిర్‌లో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. వలవల విజయ్ దంపతులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాయిపేట పుంతలోముసలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్టీమర్ రోడ్డు పండ్ల మార్కెట్ వద్ద ఉత్సవాలు ముగిశాయి. శ్రీరాజరాజేశ్వరి మాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. లడ్డూ వేలంపాటలో రూ.35000లుకు కేసరి సత్యనారాయణ దక్కించుకున్నారు. ఆలయకమిటి ప్రతినిధులు గునిశెట్టి సత్యనారాయణ, మండెల కృష్ణ, గునిశెట్టి శ్రీనివాస్, చిట్టూరి కృష్ణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. చినమామిడిపల్లిల్లో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం విజయదశమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల శమీ వృక్షానికి పూజలు చేశారు. గత పది రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ దేవీ నవరాత్రుల వేడుకలు ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోనూ, ప్రధాన కూడళ్లలోనూ ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. పలు చోట్ల ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాలకు వేలం పాట నిర్వహించారు. వేములదీవి చిన మైనవానిలంక గ్రామంలోని కనకదుర్గమ్మ వారి ఆలయం, ఎల్బీచర్ల మిరియాలవారి ఇళ్లవద్ద, చిట్టవరం, కొప్పర్రు, వేములదీవి కాపులకొడప గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాల వద్ద విజయదశమి సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. పితానిమెరకలో ఉన్న జాజులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో దేవిశరన్నవరాత్రుల ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం విజయదశని పురస్కరించుకుని అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరణ చేశారు. క్షీరారామలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారు, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాకార మండపం వద్ద జమ్మి చెట్టుకు ప్రదక్షిణలు, పూజలుచేశారు. స్థానిక యడ్లబజారు సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని శాంతదేవిగా అలంకరించారు. పట్టణంలో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు వద్ద గురు వారం రాత్రి జమ్మిచెట్టుకు పూజలు చేసి దీపాలంకరణలు చేశారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరా వు, అర్చకులు అనిల్, కిష్టప్ప, వీరబాబులు పాల్గొన్నారు.

పెనుగొండలో...

పెనుగొండ: దసరా ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెనుగొండ రెండో మైసూరుగా పేరు పొందడంతో దసరా ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వస్తుంటారు. దీంతో గురువారం ఉదయం నుంచి పెనుగొండలో దసరా కోలాహలం నెలకొంది. పెనుగొండ వేంద్రవారి వీధి, కొప్పిశెట్టివారి వీధి, పిల్లి వారి వీధిల్లోని ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఏనుగుల సంబరం, హనుమద్ గ్రామోత్సవం, వెంకటేశ్వరుని అవతారాలు, అమ్మవారి అవతారాలుతో ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా లింగాల వీధిలో ఆర్కెస్ట్రా, గుబ్బల గూడెంలో జబర్దస్త్ టీం హంగమా ఆకట్టుకుంది. రెండో శ్రీరంగంగా పేరున్న కొఠాలపర్రులో కేశవ స్వామిని గ్రామోత్సవంగా తీసుకువెళ్లి శమీ పూజలు నిర్వహించారు. వడలిలో మహిళలు శమీ పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలకు ముగింపు పలికారు. సిద్ధాంతం దేవీ సెంటర్‌లో దసరా సందర్భంగా నిర్వహించిన దీపోత్సవం ఆకట్టుకొంది.


పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ


పెనుగొండ: అలరించిన ఏనుగుల సంబరం


నరసాపురం: ప్రత్యేకాలంకరణలో గడ్డిబజార్‌లోని కనకదుర్గమ్మ


నరసాపురం రూరల్: రుస్తుంబాదలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పెనుగొండ: వడలిలో శమీ పూజలు చేస్తున్న భక్తులు



పెనుగొండ: సిద్ధాంతంలో గ్రామోత్సవంలో ఆకట్టుకున్న అమ్మోరు సెట్టింగు



నరసాపురం: స్టీమర్‌రోడ్డులో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం


పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి దేవి

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి


నరసాపురం: కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం


పెనుగొండ: జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నివాలులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసాపురం: గాంధీజీ ఆశయాల సాధన దిశగా ప్రతిఒక్కరూ ముందుకు వెళ్లాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు పీడీ రాజు అన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి వేడుకను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ముదునూరి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీడీ రాజు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించడం ద్వారా ప్రతి గ్రామానికి, కుటుంబానికి ప్రభుత్వ పాలన చేరువ చేశారన్నారు. మహాత్ముడు చెప్పిన గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా ప్రయత్నం గత ప్రభుత్వం చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, పార్టీ ట్రేడ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎండీ షాన్‌వాజ్ఖాన్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బందన పూర్ణచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఉంగరాల రమేష్, కడలి అబద్ధం కడలి రాంబాబు, బర్రి శంకరం, అద్దాల నర్సింహరావు, మైలాబత్తుల శ్రీను, తిరుమాని రామకృష్ణరాజు, సయ్యపురాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో భారతదేశ మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి, జాతిపిత మహాత్మా గాంధీల జయంతి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గురువారం వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్త కుళాయి చెరువు గట్టు వద్ద గాంధీ జయంతి నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, పాలపర్తి కృపానాథ్, చెన్ను విజయ్, షేక్ చాన్ భాషా, దేవరాజేష్, నీలంశెట్టి సత్యప్రసాద్, బోడి సూర్యారావు, మురళీకృష్ణంరాజు, లయన్స్ సభ్యులు శిడగం సతీష్, దేవరపు ప్రసాద్, ఎస్ కామేశ్వరరావు, అన్నపూర్ణ, శిడగం ఈశ్వర్, మైథిలి, దేవత వెంకట్రావు పాల్గొన్నారు.

పెనుగొండ: జాతీ పిత మహాత్మాగాంధీకి పెనుగొండలో వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం గాంధీ జయంతి పురస్కరించుకుని గాంధీ బొమ్మల సెంటర్‌లో గాంధీ ఇతర నాయకులకు పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యకరమంలో మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాప రెడ్డి(బాబీ), ఎస్సీ సెల మండల కన్వీనరు పలివెల శ్రీను, పట్టణ అధ్యక్షుడు అను నగరి, పార్టీ నాయకులు బాబూరావు, ఏడిద కోదండ చక్రపాణి, నూలి పవన్, వి.బుచ్చిబాబు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


పోషకాహారంపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: కిషోర బాలికలు పోషకాహారం తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు అధికారి ఎం.ఉమా అన్నారు. శుక్రవారం స్థానిక గుత్తులువానిపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ పోషణాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, ఊబకాయం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చన్నారు. కిషోర బాలికలకు బరువు చూసి బీఎంఐ పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధనలు


పసలదీవిలో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సమారాధనలు నిర్వహించారు. మండలంలోని పసలదీవి, ఎల్బీచర్ల మిరియాల వారి ఇళ్ల వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల వద్ద శుక్రవారం మధ్యాహ్నం అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

సీహెచ్‌సీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికుల వేతనాలు సత్వరం చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఐదు నెలలుగా వేతనాలుచెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రావిడెంట్ ఫండ్, ఎరప్లాయీ స్టేట్ ఇన్సూరెన్స్ బకాయిలు చెల్లించకపోవడంతో కుటుంబం గడిచే పరిస్థితి లేదన్నారు. అదేవిధంగా సిబ్బంది కొరత అధికంగా ఉండడంతో మిగిలిన వారిపై పనిభారం పెరిగిపోతుందన్నారు. 18 మంది చేయాల్సిన పనులను కేవలం ఎనిమిది మందితో చేయిస్తున్నారన్నారు. కొత్త, పాత ఆసుపత్రుల్లో 45కు పడకలు ఉండడంతో కార్మికులకు పని భారం పెరిగిందన్నారు. ఈ నెల 17లోపు జీతాలు చెల్లించకపోయినా, సమస్యలు పరిష్కరించకపోయినా సమ్మె బాట పడతామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్‌కే పాదుషా తదితరులు పాల్గొన్నారు.


సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాంబాబుకు సమ్మె నోటీసు అందిస్తున్న కార్మికులు

రీసర్వేకు రైతులు సహకరించాలి

యలమంచిలి: రీ సర్వే వేగంగా జరగడానికి రైతులు తమ సంపూర్ణ సహకారం అందించాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ కోరారు. మూడో దశ రీ-సర్వే నేరేడుమిల్లి, యలమంచిలి గ్రామాలలో ప్రారంభిస్తున్న సందర్భంగా శుక్రవారం నేరేడుమిల్లి గ్రామ సచివాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. రీసర్వే జరుగుతున్న తేదీ, సమయం ముందుగానే రైతులకు సమాచారం ఇస్తామన్నారు. వారికి కేటాయించిన తేదీల్లో రైతులు హక్కు పత్రాలు, డాక్యుమెంట్లుతో భూమి వద్దకు హాజరై సర్వే అధికారులకు సదరు భూమి హద్దులు చూపించి సర్వే వేగంగా జరగడానికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెన్మత్స వాణి బుజ్జిరాజు, నీటి సంఘం అధ్యక్షుడు పెన్మత్స రామభద్రరాజు, నారినమెరక సొసైటీ అధ్యక్షులు డేగల సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్

నేడు యలమంచిలిలో..

యలమంచిలి రెవెన్యూ గ్రామానికి సంబంధించి రీసర్వే గ్రామ సభ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు యలమంచిలి గ్రామ సచివాలయం వద్ద నిర్వహిస్తామని తహసీల్దార్ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ రైతులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఫ్లెక్సీ తొలగించారని సెల్ టవర్ ఎక్కి నిరసన

నరసాపురం: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నేత కాకిలేటి ఆనంద్‌కుమార్ గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఉదయం 11 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. చివరకు సహచరులు నచ్చజెప్పడంతో గంటన్నర తరువాత ఆయన సెల్ టవర్ దిగి వచ్చారు. ఆనంద్ తన పుట్టినరోజు నేపథ్యంలో ట్యాక్సీస్టాండ్ వద్ద తన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఆయన ట్యాక్సీ డ్రైవర్ల అసోసియేషన్ నాయకుడిగా కూడా పనిచేస్తున్నారు. స్టాండ్‌లోని కొందరు డ్రైవర్లు ఫ్లెక్సీ తొలగించారని, పట్టణ సీఐ తనపై కక్షగట్టి వారికి చెప్పి తొలగింపజేశారని ఆనంద్ విమర్శిస్తున్నారు. తాను దళితుడిని కాబట్టి, తనపై కక్షతో వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్న ఫ్లెక్సీ కట్టినందుకు ఇదంతా చేస్తున్నారని ఆనంద్ టవర్‌పై నుంచే సెల్ఫీ వీడియో విడుదల చేశారు. పోలీసులు మాత్రం ఫ్లెక్సీ తొలగింపుతో తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఆనంద్ ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అంటున్నారు.


సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న కాకిలేటి ఆనంద్